# విన్నపము

- భగవత్ సాన్నిధ్యాన్ని పొందిన **ప్రియ జ్యోత్స్నల.**

ఓ భగవంతుడా!

- నేను మానసికంగా బలహీనంగా ఉన్నప్పుడు ఎందుకు ఆ విధంగా ఉన్నానో తెలుసుకోగల విశ్లేషణ నాకివ్వు.
- నేను భయపడ్డప్పుడు ఆ భయానికి గల కారణం తెలుసుకోగలిగే ధైర్యాన్నివ్వు.
- గెలిచినప్పుడు ఆ గెలుపుని గర్వంగా మారనివ్వని వినమ్రతనివ్వు.

ఓ భగవంతుడా!

- ఒక ఓటమిలో కూరుకుపోయినప్పుడు దీనిని గర్వంగా ఒప్పుకోగలిగే సాహసాన్నివ్వు.

ఓ భగవంతుడా!

- ఆశలని మెదడులో నింపకు. ఆశలని హృదయంలో ఉంచి, అవి నెరవేరే ఆలోచనలని మెదడులో నింపు.
- నన్ను నేను తెలుసుకోవడమే నా విజ్ఞానానికి మొదటిపాఠం అన్న ఇంగిత జ్ఞానాన్ని పుట్టుకతోనే నాకివ్వు.
- నా జీవితాన్ని పూలపాన్పు చేయకు, ముళ్ళ బాధ తెలిసిన తరువాత పూల తాలూకు మెత్తదనం మరింత అర్థమవుతుందన్న పాఠాన్ని నాకు నేర్పు.

ఓ భగవంతుడా!

- నా హృదయం స్వచ్ఛంగా, నా గమ్యం ఎత్తుగా, నా ఆలోచనలు నిర్దుష్టంగా సాగేటట్లు చేయి.
- నన్ను నేను ఎంత తొందరగా గెలిస్తే, ఇతరులని అంత తొందరగా గెలవగలను అన్న చిన్న పాఠాన్ని నా బాల్యంలోనే నన్ను తెలుసుకొనేలా చేయి.
- హాయిగా నవ్వడం ఎలాగో నేర్పు. దు:ఖాన్ని మరువనివ్వకు. భవిష్యత్తు ఎలా తీర్చిదిద్దుకోవాలో నేర్పు. గతాన్ని మరువనివ్వకు.

ఓ భగవంతుడా!

- హాస్యాన్ని ఆస్వాదించే గుణాన్ని నానుంచి దూరం చేయకు. అందువల్ల, నేను ఎంత సీరియస్‌గా ఉండాల్సిన పరిస్థితిలోనైనా నన్ను నేను కోల్పోను.
- నాకు కొద్దిగా అణకువనివ్వు. అందువల్ల - ఎంత పెద్ద గెలుపులోనైనా నన్ను నేను కోల్పోను.

సంపూర్ణమైన వ్యక్తిత్వానికి ఇవే మూలకారణాలని నేను విశ్వసిస్తున్నాను. ఇంతకన్నా గొప్ప కారణాలు నువ్వు కూడా చెప్పలేవన్న నా వాదనని నా అహంగా అనుకోకు.

( ప్రియ తన పందొమ్మిదవ ఏట డైరీలో వ్రాసుకున్న, ఎన్నో ఏళ్ళు సాధన చేస్తేగాని ఆచరణలో పెట్టలేని, భగవద్గీతాసారం. దీనికి 'విన్నపము' అని (మాకున్న పరిమితమైన అనుభవంతో)పేరును నిర్ణయించేము. చదివిన తరువాత మీరు వేరేదైన పేరును సూచించదలిస్తే, మాకు తెలియజేయండి. ఇది నలుగురికి ఉపయోగపడుతుందనే నమ్మకముతో ప్రచురిస్తున్నాము. - సంపాదక వర్గం.)